క్లుప్తంగా

గ్రామాల్లో ఉపాధి పనులు



మారెళ్ల ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తుగ్గలి: కూలీలు వలసలు వెళ్లకుండా స్థానికంగా పనులు కల్పిస్తున్నారు. మారెళ్ల, ఉప్పర్లపల్లి, రామాపురం, జీ.ఎర్రగుడి, శభాష్‌పురం తదితర గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టారు. పండ్ల తోటలు, గృహ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు తదితర పనుల్లో శనివారం 2వేల మంది దాకా కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొన్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని ఎవరూ వలసలు వెళ్లొద్దని ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు అవగాహన కల్పిస్తున్నారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ రామకృష్ణ తెలిపారు.

సెక్టోరల్ అధికారుల నియామకం

మద్దికెర: సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లా అధికారులు మండలంలోని పోలింగ్‌బూత్‌లకు సంబంధించి సెక్టోరల్ అధికారులను నియమించారని తహసీల్దార్ నాగభూషణం శనివారం తెలిపారు. మండలంలో ఆయా గ్రామాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా సజావుగా ఓటుహక్కువినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్ మండలంలోని అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారన్నారు. మండలంలో 34 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అందులో ఎంఈఓ 8, ఏఓ 12, పీఆర్ఏఈ 8, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ 6 బూత్‌లను పర్యవేక్షిస్తారన్నారు.

14 నుంచి సహకార వారోత్సవాలు

తుగ్గలి: అఖిల భారత సహకార వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉప్పర్లపల్లి, మారెళ్ల సింగిల్‌విండో బ్యాంకు సీఈఓలు గిడ్డయ్య, మనోహర నాయుడు శనివారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పంట రుణాల పంపిణీ, చెల్లింపు, బ్యాంకు సేవలపై రైతులకు అవగాహన, సంఘాల్లో ఇటీవల పరిణామాలు, పునరుజ్జీవనం, ఆర్థిక చేరిక తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కూలిన మట్టి మిద్దె



కూలిన మిద్దెను పరిశీలిస్తున్న సర్పంచ్ మల్లికార్జున

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో తేరు బజారు వీధిలో బంగారు హుసేన్‌సాబ్ మట్టిమిద్దె శనివారం కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ముళ్ల కంపల తొలగింపు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో పొదుపు మహిళలు శ్రమదానం చేశారు. ఎస్సీ కాలనీ నుంచి గంజిళ్ల గ్రామానికి వెళ్లే రహదారి, పొలాల రస్తా, దళితుల శ్మశానానికి వెళ్లే దారికి ఇరువైపులా ముళ్ల కంపను తొలగించారు. సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ కూడా మహిళలతో కలిసి కలిసి ముళ్లకంపలను, చెట్లను తొలగించారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీం లీడర్ నరసప్ప పాల్గొన్నారు.

ఘనంగా షేక్ బిరద్దీన్ దాదా ఉరుసు



ప్రత్యేక అలంకరణలో షేక్ బిరదీన్ దాదా సమాధి

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామ సమీపంలో వెలిసిన షేక్ బిరద్దీన్ దాదా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి తాత సమాధిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున గంధం ఊరేగింపుగా దర్గాకు చేరడంతో భక్తులు ఫాతెహాలు చేశారు. ఆదివారం జియారత్‌తో వేడుకలు ముగియనున్నాయి.

సీపీఎం ప్రజా రక్షణభేరిని జయప్రదం చేయండి

హొళగుంద: ఈనెల 15న విజయవాడలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ప్రజా రక్షణభేరి మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం, సీఐటీయూ మండల కార్యదర్శులు వెంకటేశ్వర్లు, చాకలి నాగరాజు కోరారు. శనివారం వారు స్థానిక బస్టాండ్ వద్ద సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు ఉలిగయ్య, తిమ్మప్ప, సలీవ, రాఘవేంద్ర, ఇబ్రహీం, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

దీపావళి వచ్చె..వెలుగులు తెచ్చే!

● పల్లె పల్లెనా నేడు దీపావళి సంబరాలు

కష్ట, సుఖాల సమాహారం జీవితం. ఎల్లకాలం కష్టాలు మనతో ఉండవని.. కష్టించి పనిచేస్తే చీకట్లు తొలగి వెలుగులోకి రావచ్చనే సత్యాన్ని లోకానికి చాటి చెప్పేదే దీపావళి పండుగ. కోటి కాంతుల దీపాలతో అమావాస్యను పటాపంచలు చేసే దీపావళి రోజున లక్ష్మీదేవి తమ ఇంట్లో కలకాలం నిలవాలని లక్ష్మీపూజ జరపడం ఆచారం. పండుగ ఆదివారం కావడంతో ఇంటిల్లిపాడి సంబరాల్లో మునిగిపోయేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు.

– కృష్ణగిరి

ఇంటింటా దీపాలు.. కంటికి ఇంపైన రంగులు.. ఇంటి ముంగిట, గోడలపైనా వరుసలు కట్టిన ప్రమిదలు.. నింగిలోని చుక్కలు నేలకు దిగినట్లు తళుకుమంటున్న దీప కాంతులు.. వీధుల్లో నక్షత్రాలు చల్లినట్లు దీపావళి కాంతులు.. ఈ పండుగ సందర్భంగా ప్రతి పల్లెలో కనిపించే దృశ్యాలు. జీవితంలో కష్టాలను చీకటితో పోల్చి విజయాల వెలుగులు అందరికీ దక్కాలన్నది ఈ పండుగ ఉద్దేశం. పండుగ వేళ కరకరలాడే కాకర పూవొత్తులు, చిరచిరలాడే చిచ్చుబుడ్లు, రివ్వున ఎగిరే తారా జువ్వలు, చెవులు దిమ్మె క్కించే లక్ష్మి పటాసులు, బుస లు కొడుతూ పొంగే పాము బిళ్లలు, వెలుగులు చిమ్మే వెన్నముద్దలు, భూ చక్రాలు, విష్ణు చక్రాలు తదితర వా టిని కాలుస్తారు.హిందువుల పండుగల్లో ప్రత్యేకమైనది ఈ పండుగ. చీకటిపై వెలుతురు సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి నిర్వహిస్తారు. ఎన్ని కష్టాలు ఎదురైనా కృంగిపోకుండా విజయం సాధించే దిశగా జీవితాన్ని నడిపించాలని దీపావళి పండుగ చెబుతోంది.

అట్టహాసంగా..

పట్టణాల్లోనే గాకుండా పల్లెలో కూడా దీపావళి అట్టహాసంగా నిర్వహిస్తారు. ఉదయాన్నే తల స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరిస్తారు. అనంతరం లక్ష్మీపూజలు చేసి ధనం సమృద్ధిగా ఇవ్వాలని కోరతారు. పిండి వంటలతో మధ్యాహ్నం విందు భోజనం చేస్తారు. సాయంత్రం ఇంటి ముందు టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకుంటారు.



టపాసులు

జాగ్రత్తలు తప్పనిసరి

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని. పిల్లలు, పెద్దలు ఎవరైనా సరే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. ముందుగానే సమీపంలో బకెట్ నిండా నీళ్లు పెట్టుకోవాలి. ఏదైనా అగ్నిప్రమాదం చోటుచేసుకుంటే వెంటనే ఫైర్, పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలి. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు వెంట ఉండాలి. పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు ఎవరు కాల్చినా పసిబిడ్డలు, పిల్లల చెవుల్లో దూది పెట్టాలి. జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలి.

– ఎస్‌ఐ సురేష్, కృష్ణగిరి

సీఎస్ఆర్ఎంఓ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ బాలాజీకుమార్

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ఏరియా హాస్పిటల్‌లో సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ఆర్ఎంఓ)గా డాక్టర్ బి.బాలజీకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా రాయదుర్గం ఏరియా హాస్పిటల్ సీఎస్ఆర్ఎంఓగా పనిచేస్తూ ఎమ్మిగనూరు ఏరియా హాస్పిటల్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తరువాత హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయిని కలిశారు. డాక్టర్ బాలాజీకుమార్‌కు సూపరింటెండెంట్‌తో పాటు డాక్టర్లు అభినందనలు తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

హొళగుంద: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగిన లింగంపల్లి గ్రామానికి చెందిన బెస్త సురేష్ (39) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ నాయక్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సురేష్ ఈనెల 6న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆదోనికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య శాంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. వాటర్‌షెడ్ పథకం కింద మంజూరైన వ్యవసాయ పరికరాలను శనివారం ఆలంకొండ రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్‌నాయుడు, నాయకులు అశోక్‌కుమార్, సుదర్శనాచారి, సురేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

మళ్లీ జగనే కావాలి

కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. అమకతాడు గ్రామంలో శనివారం సర్పంచ్ బోయ సర్వేశ్వరితో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి)కార్యక్రమం చేపట్టారు. ఇంటింటా తిరిగి మేనిఫెస్టో అమలుపై లబ్ధిదారుల అభిప్రాయాలు సేకరించారు. జగనన్న ప్రతిపక్ష హోదాలో రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను చూపి మేనిఫెస్టో తయారీ చేసి ముఖ్యమంత్రి అయ్యాక 99 శాతం అమలు చేశారన్నారు. చంద్రబాబు 2014లో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కారన్నారు. 2024 కూడా అబద్ధపు హామీలతో ఓటు అడిగేందుకు వస్తారని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌నాయుడు, నాయకులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, బాలమిన్నెల్ల, బూడిద శేఖర్ పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

హొళగుంద: వందవాగిలి అంబేడ్కర్ సర్కిల్ నుంచి మసీదు వరకున్న ప్రధాన రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వాహనాల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా ఉన్న విషయాన్ని స్థానికులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో అధికారులు నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. త్వరలో రోడ్డు పూర్తయితే సమస్య పరిష్కారమైనట్లేనని వందవాగిలి వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రి గేటులో ఇరుక్కుపోయిన ఆటో



గ్రిల్‌లో ఇరుక్కుపోయిన ఆటో

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు వచ్చే ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్‌లో రోగులతో వస్తున్న ఆటో ఇరుక్కుపోయింది. గేటు వద్ద వాహనాలు వచ్చేందుకు ఏర్పాటు చేసిన ఇనుప పైపులు దెబ్బతినటంతో లోపలికి కూరుకుపోయాయి. దెబ్బతిన్న గేటు వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్‌కు ప్రభుత్వాసుపత్రి అధికారులు మరమ్మతులు చేయించకపోవటంతో రోగులతో వచ్చే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు స్పందించి దెబ్బతిన్న గేటు వద్ద గ్రిల్‌కు మరమ్మతులు చేయించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం పులగుమ్మి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం సాయంత్రం పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన శివపురం వడ్డే వెంకటేష్(38) తన పొలంలో పురుగు మందుతాగి అపస్మారక స్థితిలో వెళ్లిన విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

డ్రైనేజీ వివాదం



వివాదాస్పదంగా మారిన డ్రైనేజీ

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వివాదం కారణంగా అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. 20 ఏళ్ల క్రితం ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి నుంచి చెరువులోకి వెళ్లే దారిలో డ్రైనేజీ నిర్మించారు. చెరువు కట్ట నుంచి పగిడిరాయికి వెళ్లే రోడ్డు చివర వరకు సీసీ రోడ్డు లేక కొన్నేళ్లుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్డు వేయకుండా గత పాలకులు విస్మరించారు. ఉపాధి నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు వేసేలా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృషి చేస్తుండగా కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ పట్టా స్థలంతో ఇంటి ముందు ఉన్న డ్రైనేజీ వల్ల దుర్వాసన వస్తుండడంతోనే పూడ్చివేశామని కాలనీకి చెందిన ఓ కుటుంబం చెబుతోంది. పలుమార్లు పంచాయతీ అధికారులు నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో పోలీసుల సాయంతో శనివారం డ్రైనేజీలో పూడిక తీయించారు. దీంతో శ్రీనివాసులు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తుంటే ఇలా అడ్డుకోవడం తగదని తగదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు తగవు

తుగ్గలి: గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుంటూ టీడీపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, జొన్నగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు పక్కీరప్ప, సోమశేఖర రెడ్డి, దివాకర్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ జొన్నగిరి ఎస్సీ కాలనీలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీని ఇప్పుడు కొందరు పూడ్చివేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఏళ్ల నుంచి శ్మశానానికి, చెరువులోకి రస్తా ఉందన్నారు. ప్రభుత్వ స్థలంలోనే డ్రైనేజీ నిర్మించారని అధికారులు చెబుతున్నా వినిపించుకోకుండా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేయిడం సరికాదన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు కాలువలో పూడిక తీయిస్తే దీన్ని ఎమ్మెల్యే శ్రీదేవికి, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆపాదించడం సబబు కాదన్నారు. టీడీపీ హయాంలోనే ఆ డ్రైనేజీ నిర్మించారనేది తెలుసు కోవాలన్నారు. కొన్నేళ్లుగా సీసీ రోడ్డు లేక అవస్థలు జనం పడుతున్నా టీడీపీ వారికి పట్టడం లేదని, ఇప్పుడు సీసీరోడ్డు వేసేందుకు సిద్ధమైతే అడ్డుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటుంటే దాన్ని ఎలాగైనా అడ్డుకోవాలనే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి ప్రోద్బలంతోనే శ్రీనివాసులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. టీడీపీ నాయకుడు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ అమాయకులను పురిగొల్పుతున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలు కాపాడే పోలీసులపై కూడా ఆరోపణలు చేయడం సరి కాదన్నారు.

జీవితాల్లో వెలుగులు నిండాలి



టపాసులు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి

మద్దికెర: ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలని పోచంరెడ్డి సేవాదళ్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోచంరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మద్దికెరలో సేవాదళ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత ట్యూషన్లో విద్యనభ్యసిస్తున్న వంద మంది విద్యార్థులకు టపాసులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఉచిత సేవలు అందిస్తున్నానన్నారు. ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకొని పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' సక్సెస్

హాలహర్వి: జగన్ ఎందుకు మళ్లీ ఏపీకి సీఎం కావాలనే కార్యక్రమం మండలంలో సక్సెస్ అయ్యిందని జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. శనివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు అవసరమని ప్రజలకు వివరించామన్నారు.

దీపావళి ప్రశాంతంగా జరుపుకోండి

ఆలూరు రూరల్: దీపావళి పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ఆయన సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ పిల్లలు, వృద్ధులకు దూరంగా బాణ సంచా కాల్చాలన్నారు. అనుమతులు ఉన్న వారు మాత్రమే బాణ సంచా విక్రయాలు జరపాలన్నారు.

శ్రీమఠానికి వెండి బిందె విరాళం



వెండి బిందెను స్వీకరిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

మంత్రాలయం : కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన రాఘవేంద్ర పాండ్యా అనే భక్తుడు శ్రీమఠానికి విరాళం అందజేశారు. శనివారం శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావుకు 531 గ్రాముల వెండితో రూ.44,410 విలువ జేసే అష్టలక్ష్మి ప్రతిమలతో తయారు చేసిన చిన్న బెందెను మొక్కుబడిలో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు మేనేజర్ స్వామి వారి శేషవస్త్రం, ఫల,పూల మంత్రాక్షింతలు అందజేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ప్రధాన రహదారిలో పర్యటిస్తున్న ఎస్‌ఐ, పోలీసులు

గోనెగండ్ల: ఎమ్మిగనూరు–కర్నూలు రహదారిపై రోడ్డు స్థలాలను ఆక్రమించుకుని, బంకులు ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. శనివారం ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి ఎమ్మిగనూరు–కర్నూలు ప్రధాన రహదారిపై పర్యటించారు. రోడ్డుకిరువైపులా బంకులు,షెడ్లు,బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.రహదారిలో వ్యాపారాలు చేసుకునేవారు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేసిన దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రంగస్థలం మహిళా కళాకారులకు కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ బైలుప్పల షఫీవుల్లా, ఎమ్మిగనూరు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరన్న శనివారం దీపావళి కానుకగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు కృష్ణమూర్తి, సోమన్న, సుందరాజు, బార్ అసోసియేషన్ కోశాధికారి మురళికృష్ణ, షేక్షావలి, హనుమంతరావు స్వామి, జగదీష్ కుమార్, రామయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



సచివాలయం–2లో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. శనివారం ఆమె ఆలూరులోని సచివాలయం–2 లో ఇంటి వైద్య కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. 118 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి రోజు వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక యాప్‌లో వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రం వెల్దుర్తి గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి కవితాబాయి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్ తెలిపారు. శనివారం వారు గ్రంథాలయంలో వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. 14న ప్రారంభ వేడుక, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయోద్యమకారుల స్మరణ, 17న కవిత సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, 20న గ్రంథాలయాలపై అవగాహన, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

దొంగల ముఠా అరెస్టు

కర్నూలు : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గొర్రెలు, కరెంటు తీగలు, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాలను తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పక్కా సమాచారం మేరకు గుంతకల్లుకు చెందిన రాఘవయ్య, కర్నూలు మమతా నగర్‌కు చెందిన ఎరుకలి సురేష్, డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన రంగనాయకులు, కర్నూలు ప్రకాష్‌నగర్‌కు చెందిన బోయ విజయ్, నరసింహారెడ్డి నగర్‌కు చెందిన ఎరుకలి మధు, అశోక్ నగర్‌కు చెందిన పేరపోగు రాకేష్, దేవనకొండకు చెందిన ఎరుకలి సురేష్, సుధాకర్, డాన్ శ్రీను, కడప రామయ్య తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. కర్నూలు మండలం రుద్రవరం గ్రామ పొలిమేరలోని కొండ వద్ద గొర్రెల దొంగతనం, అలాగే కర్నూలు బాలాజీ నగర్, వెంగన్నబావి సమీపంలోని బాలాజీ విల్లాస్‌లోని ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. అలాగే జి.శింగవరం గ్రామంలో మోటర్ సైకిల్, నిడ్జూరు, ఉలిందకొండ, సూదేపల్లి, బ్రాహ్మణదొడ్డి, సంగాల, కడప జిల్లా ముద్దనూరు మండలం చెన్నంపల్లి గ్రామాల్లో మొత్తం 111 గొర్రెలు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.21 లక్షలు విలువ చేసే గొర్రెలు, మోటర్ సైకిళ్లు, బంగారు, వెండి ఆభరణాలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు. అలాగే కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామం వద్ద ఎన్‌హెచ్–44 నుంచి నంద్యాలకు వెళ్లే హైవే రింగ్ రోడ్డు మధ్యలో గల టిడ్కో ఇళ్లల్లో కరెంటు వైర్లు దొంగతనం చేసిన మరో 16 మంది ముఠా సభ్యులు నంద్యాల జిల్లాకు చెందిన పసువుల శ్రీకాంత్, నరసింహుడు, బోయ శ్రీనివాసులు, మధుబాబు, బాలకొండయ్య, పసుపుల నాగేంద్ర, పుల్లయ్య, ఎర్రపాపన్న, పోలూరు మల్లికార్జున, షేక్ ఫరూక్ బాషా, నాగశేషులు, ప్రసన్న కుమార్, చింతమాను నాగరాజు, బోయ పెద్ద ఎల్లయ్య, వడ్డె మదనగోపాల్, షేక్ బాబా హుసేన్ తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.19,61,517 విలువ చేసే 315 కరెంటు వైర్ బండిల్స్, నేరానికి ఉపయోగించిన తుఫాన్ వాహనం, రెండు మోటర్‌సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. రెండు ముఠాల నుంచి రూ.61,61,517 విలువ చేసే సొమ్ములు, వాహనాలు, గొర్రెలను రికవరీ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు.



దొంగల ముఠా నుంచి రికవరీ చేసిన వాహనాలు, వైర్లు,నగలు, నగదువివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీరాం